క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ గెలుపుతో పేదలకు మేలు

కొల్లూరు : పేద వర్గాలు ఆర్థికంగా పురోగతి సాధించాలంటే అది కేవలం వైఎస్సార్ సీపీ విజయంతోనే సాధ్యపడుతుందని వేమూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు కుమారుడు వరికూటి తేజ అన్నారు. మంగళవారం మండలంలోని ఈపూరులో స్థానిక వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఆయన ఇంటింట ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం చేపట్టిన సంక్షేమ పథకాల కారణంగా పేద వర్గాలకు ఆర్థికంగా మేలు చేకూరిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాన్ని గుర్తుంచుకొని ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో పార్టీకి మద్దతుగా నిలిచి తిరిగి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఇంటింటికి తిరిగి కర పత్రాలను అందజేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు పడమట వెంకటలక్ష్మి, అమిరిశెట్టి శ్రీధర్, ఇంటూరి ప్రవీణ్, కోఆప్షన్ సభ్యుడు షేక్ బాజి, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాలిమేర నవీన్‌రెడ్డి, పిల్లి బుజ్జి, కొల్లి ప్రసాద్, మంచాల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

6న లోక్ అదాలత్‌పై సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని న్యాయ సేవాధికార భవనంలో మే 11న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 6న న్యాయ సేవాధికార భవన ప్రాంగణంలో డివిజన్ పరిధిలోని పోలీసు శాఖ అధికారులకు సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి డివిజన్ పరిధిలోని పోలీసు శాఖ అధికారులు హాజరు కావాలని కోరారు.

నేడు కర్లపాలెంలో కోన ఎన్నికల ప్రచారం

కర్లపాలెం: వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి కోన రఘుపతి కర్లపాలెం మండలంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు ఆయన సమ్మెటవారిపాలెం, శీలంవారిపాలెం గ్రామాలలో ఎన్నికల ప్రచారం ప్రారంభించి పేరలి, తుమ్మలపల్లి గ్రామాల వరకు ప్రచారం కొనసాగిస్తారని తెలిపారు. వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అనుబంధ విభాగల అధ్యక్షులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రేపల్లె రూరల్: మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెనుమాల సుశీల అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

మద్యం విక్రేత అరెస్టు

కొల్లూరు : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని తోకలవారిపాలెంకు చెందిన మండె సుదర్శనరావు ప్రభుత్వ మద్య దుకాణం నుంచి మద్యం సీసాలు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నాడన్న సమాచారంతో ఎస్ఐ రవీంద్రరెడ్డి ఆదేశాలతో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. అక్రమంగా అమ్మకాలు జరపడానికి నిల్వ ఉంచిన 22 బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. నిందితుడ్ని తెనాలి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

సార్వత్రిక ఎన్నికలపై అవగాహన సదస్సు



గుంటూరు రూరల్: వచ్చేనెలలో జరిగే సార్వత్రిక ఎన్నికలపై సౌత్‌జోన్ డీఎస్పీ మెహబూబ్‌బాషా ఆధ్వర్యంలో మంగళవారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. 40వ డివిజన్ పెదపలకలూరు గ్రామంలో జరిగిన సదస్సులో అన్ని పొలిటికల్ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగిలే ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అందుకు అన్ని పార్టీల సహాయ సహకారాలు అవసరమని తెలిపారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని తెలిపారు. ఎవరైనా నియమావళిని ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ నరేష్ కుమార్, ఎస్ఐ సత్యనారాయణ, గ్రామ ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్



మాట్లాడుతున్న ఆర్డీఓ గంధం రవీందర్

బాపట్ల: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన ఎన్నికల నియమ నిబంధనలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు వినియోగంపై అన్ని రాజకీయాల పార్టీల నాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓటు ఎంతో విలువైనదని సమర్థవంతమైన నాయకులను ఎన్నుకునే శక్తివంతమైన ఓటును ఎవరూ వృథా చేసుకోవద్దన్నారు. ఓటు హక్కుపై హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందని 14 వరకు ఫామ్ 6, ఫామ్ 8 దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఓటు మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఇంటి వద్దే ఓటు' పై వివరాలు సేకరించండి

కొల్లూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఇంటి వద్దే ఓట్లు వేయాల్సిన వారి వివరాలను నిర్ధారణ చేసుకోవాలని కొల్లూరు తహసీల్దార్ పుల్లారావు సూచించారు. మంగళవారం కొల్లూరు మండల పరిషత్తు కార్యాలయంలో బీఎల్‌ఓలకు పలు అంశాలపై సూచనలిచ్చారు. ప్రధానంగా ఎన్నికల కమీషన్ తీసుకొచ్చిన నూతన ప్రక్రియలో భాగంగా 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతంకు పైబడిన దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో బీఎల్‌ఓలు సంబంధిత పత్రాలను వారికి అందజేసి వారి అభిప్రాయాలను స్వీకరించాలన్నారు. అర్హతున్న వ్యక్తులు పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేయడానికి ఆసక్తి చూపిన పక్షంలో అటువంటి వారి వివరాలు నమోదు చేసుకోవడంతో పాటు ఓటు హక్కును పోలింగ్ కేంద్రంకు వచ్చి వినియోగించుకోగలిగిన వారి వివరాలను సైతం స్వీకరించాలన్నారు. ఎన్నికల నియమావళిని అమలు చేసే విషయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మీకుమారి, ఈఓపీఆర్‌డీ రవిబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్



పిడపర్రులో పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

పిడపర్రు(కొల్లిపర): మండలంలోని 51 పోలింగ్ కేంద్రల్లో పక్కాగా వసతులు కల్పించాలని తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని పిడపర్రు గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో విష్ణుప్రసాద్‌లతో కలసి తనిఖీ చేశారు. బీఎల్‌వోల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి, కేంద్రాల్లో ఓటర్లకు కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో విభిన్న ప్రతిభావంతులు వంద శాతం ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఫించన్ల కోసం నగదును బ్యాంకుల నుంచి తీసుకురావడం, పంపిణీ చేసే ప్రక్రియను తహసీల్దారు, ఎంపీడీవోలు పకడ్బందీగా పంపిణీ పూర్తయ్యే వరకు పర్యవేక్షించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు చంద్రమోహన్, పూర్ణశంకరరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వలంటీర్లతో ఫించన్ పంపిణీ చేపట్టాలని వినతి



కొల్లూరు : ఫించన్‌ల పంపిణీలో లబ్ధిదారులకు ఇబ్బందులు ఎదురవ్వకుండా వలంటీర్లతోనే పంపిణీ చేపట్టాలని ఫించన్‌దారులు మొరపెట్టుకున్నారు. మంగళవారం చుండూరుకు చెందిన పలువురు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీఓ అరుంధతికి వినతి పత్రం అందజేశారు. వలంటీర్ల ద్వారా ఫించను పంపిణీ చేయించి తమ కష్టాలు తప్పించాలని విన్నవించుకున్నారు. టీడీపీ కుయుక్తులు కారణంగా ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను వెనక్కు తీసుకోవాలని కోరారు. వలంటీర్లకు తిరిగి ఫించన్లు అందజేసే బాధ్యత అప్పగించాలని వినతి పత్రం అందజేశారు. ఎండలు మండుతున్న తరుణంలో వృద్ధులు, దివ్యాంగులు, ఇతర ఫించన్‌దారుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

తెనాలిఅర్బన్: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష పేర్కొన్నారు. కఠెవరం గ్రామంలోని సచివాలయం వద్ద మంగళవారం సాయంత్రం ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు వజ్రాయుధమని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. అందరూ నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఓటు వినియోగిస్తామనే ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎ.రామచంద్రరావు, కఠెవరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈ నెల 9న హనుమాన్ చాలీసా పారాయణం

తెనాలిటౌన్: బోసు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 9న క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ పురస్కరించుకుని సాయంత్రం 5 గంటలకు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు హనుమాన్ సేవా సమితి నిర్వాహకులు వుప్పల వరదరాజులు మంగళవారం తెలిపారు. అనంతరం ములుకుట్ల విశ్వనాథశర్మచే పంచాంగ శ్రవణం జరుగుతుందన్నారు. హనుమాన్ చాలీసా పారాయణ చేసేవారు ముందుగా తమ పేర్లను 9849346569 నంబరుకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి లేఖన క్రీస్తు మహాసభలు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని రైల్వేస్టేషన్ సమీపంలో ఈ నెల 3, 4, 5 తేదీలలో లేఖన క్రీస్తు మహాసభలు నిర్వహిస్తున్నట్లు బ్రదర్ ఎ.పరిశుద్ధరావు మంగళవారం తెలిపారు. హోలీ అపోస్తలిక్ మిషన్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం 11 గంటలకు, సాయంత్రం 6.30 గంటలకు సభలు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రజలు మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఆదుకుంటాం



మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

తెనాలిఅర్బన్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సమగ్ర శిక్ష జిల్లా ఎడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి, మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణలు పేర్కొన్నారు. బాలాజీరావుపేటలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత నిర్ధారణ పరీక్షలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బుద్ధి మాంద్యం, వినికిడి, దృష్టి లోపాలు ఉన్న వారికి పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. శారీరక వైకల్యం ఉన్న వారికి వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, రోలేటర్స్, బుద్ధి మాంద్యం ఉన్న వారికి ఎంఆర్ కిట్స్, కంటి చూపు దెబ్బతిన్న వారికి బ్రెయిలీ కిట్లు అందిస్తామని చెప్పారు. వీటన్నిటిని ప్రభుత్వం ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. అలాగే భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. పిల్లల రవాణా అలవెన్స్‌లు, ఎస్కార్ట్, హెచ్‌బీఏ, రీడర్ అలవెన్స్‌లు, గర్ల్స్ స్టైపెండ్ వంటివి ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు. ఎంఈవో-2 వి.జయంతిబాబు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల సహకారంతో భవిత కేంద్రాన్ని ఎంతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అనంతరం జిల్లా వైద్యశాలలోని వైద్యులు చిన్నారులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సహిత విద్యా విభాగం సమన్వయ కర్త ఎస్.శ్రీనివాసరావు, పలువురు టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రచయిత శ్రీరామకృష్ణ మరణం సినీ పరిశ్రమకు తీరనిలోటు

మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: తమిళ, తెలుగు అనువాద చిత్రాల సంభాషణల రచయిత, సినీదర్శకుడు తెనాలికి చెందిన శ్రీరామకృష్ణ మృతికి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా–ఏపీ) సంతాపం వ్యక్తం చేసింది. రూరల్ మండలం పెదరావూరులోని స్టూడియోలో మంగళవారం సాయంత్రం శ్రీరామకృష్ణకు నివాళి అర్పించింది. అనంతరం మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ దాదాపు 300పైగా సినిమాలకు సంభాషణలు అందించిన శ్రీరామకృష్ణ స్టార్ రైటర్‌గా గుర్తింపు పొందారని చెప్పారు. బొంబాయి, జీన్స్, ఒకేఒక్కడు, అపరిచితుడు, భారతీయుడు, జంటిల్‌మెన్, చంద్రముఖి, రోబో వంటి ఎన్నో విజయవంతమైన సినిమాలకు శక్తివంతమైన సంభాషణలను అందించిన గొప్ప రచయిత తెనాలి వాసి కావటం గర్వకారణమన్నారు. ప్రఖ్యాత నటి ఐశ్వర్యారాయ్ జీన్స్ చిత్రంలో సంభాషణలు పలికే తీరును శ్రీరామకృష్ణ దగ్గరే నేర్చుకున్నానని చెప్పటం ఆయనలోని ప్రతిభకు నిదర్శనమన్నారు. తెనాలిలో ఎదిగి, చెన్నైలో రైటర్‌గా స్థిరపడిన శ్రీరామకృష్ణ, కొన్ని తమిళ సినిమాలకు సంభాషణలు రాయటమే కాకుండా మణిరత్నం, శంకర్ సినిమాలకు అనువాద రచయితగా పనిచేశారని సోదాహరణంగా చెప్పారు. బాల మురళి ఎంఏ, సమాజంలో స్త్రీ సినిమాలకు దర్శకత్వం కూడా వహించినట్టు గుర్తు చేశారు. ఆయన మరణం సినీపరిశ్రమకు తీరని లోటన్నారు. వీరితో సహాయ నటులు మిలటరీ ప్రసాద్, అమీర్‌చౌధురి, సహాయ దర్శకుడు వెంకీ రావణ్‌లు ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్, పక్కన సీఐలు

తెనాలిరూరల్: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని డీఎస్పీ ఎం.రమేష్ విజ్ఞప్తి చేశారు. సబ్ డివిజన్‌లోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రముఖులతో పీస్ కమిటీని పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యులతో పోలీసు అధికారులు మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, రానున్న ఎన్నికలనూ ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. సబ్ డివిజన్‌లోని తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో ఎక్కడా ఎటువంటి అలజడులు రేగకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా సబ్ డివిజనల్ పీస్ కమిటీని ఏర్పాటు చేసినట్టు వివరించారు. అన్ని వర్గాలకు చోటు కల్పిస్తూ కమిటీని ఏర్పాటు చేశామని, ఎన్నికలు పూర్తయ్యే వరకు సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ చిన్నపాటి అలజడి రేగినా వెంటనే అక్కడి వారితో మాట్లాడడంతో పాటు సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించాలన్నారు. రెండు నియోజకవర్గాల్లో కొన్ని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, అక్కడ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. సమావేశానికి హాజరైన వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో తెనాలి వన్‌టౌన్, టూ టౌన్, త్రీ టౌన్, రూరల్, పొన్నూరు టౌన్ సీఐలు జి.దశరథరామారావు, ఎ.సుధాకర్, ఎస్.రమేష్‌బాబు, టి.వెంకటేశ్వర్లు, భాస్కర్, తెనాలి రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ మహేష్‌కుమార్, పొన్నూరు టౌన్ ఎస్ఐ భార్గవ్ పలు సూచనలు చేశారు. పీస్ కమిటీతో త్వరలో మరికొన్ని సమావేశాలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

వలంటీర్ల ద్వారానే పింఛన్లు పంపిణీ చేయాలి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం అందించే సమాజిక పింఛన్లను వలంటీర్ల ద్వారానే ఇంటింటికి వెళ్లి అందించేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగ విభాగం నాయకుడు బండారు దుర్గారావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు సచివాలయానికి వెళ్లి పింఛను తీసుకునే పరిస్థితి లేదని తెలిపారు. పట్టణాల్లో కొన్ని వార్డు సచివాలయాలు రెండో అంతస్తులో ఉన్నారని, ఎలక్షన్ కమిషన్ పింఛన్ల పంపిణీలో పునరాలోచన చేయాలని పేర్కొన్నారు.

చేబ్రోలు మాజీ సర్పంచ్ వెంకటప్పారెడ్డి మృతి

చేబ్రోలు: చేబ్రోలు మాజీ గ్రామ సర్పంచ్ గాదె వెంకటప్పారెడ్డి(95) సోమవారం రాత్రి మృతి చెందారు. చేబ్రోలులోని కొత్తరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన గాదె వెంకటప్పారెడ్డి 1980–85 మధ్య చేబ్రోలు మేజర్ గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా పనిచేసి ప్రజల మన్ననలు పొందారు. కొత్తరెడ్డిపాలెంలో జన్మించిన వెంకటప్పారెడ్డి వ్యవసాయం, విద్య, సమాజ, సాంఘిక సేవా కార్యక్రమాల్లో అగ్రగామిగా నిలిచారు. పొగాకు రంగంలో మంచి ఖ్యాతి పొందారు. 2002 సంవత్సరంలో పొగాకు రైతుల జీవితకాల సాధన అవార్డును పొందారు. చేబ్రోలు ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. భారత ప్రభుత్వం వాణిజ్యశాఖ తంబాకు బోర్డులో ఉప చైర్మన్‌గా ఆయన విశేష సేవలు అందించారు. ఆల్ ఇండియా టుబాకో బోర్డు అధ్యక్షుడిగా, కొండవీటి కమిటీ ఉన్నత పాఠశాల సెక్రటరీగా పనిచేశారు. తెనాలి సమితి రెడ్డి హాస్టల్ ప్రెసిడెంట్‌గా చేశారు. వెంకటప్పారెడ్డికి భార్య, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. సోమవారం రాత్రి మరణించిన వెంకటప్పారెడ్డి అంత్యక్రియలు మంగళవారం స్వగ్రామంలో జరిగాయి. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామ పెద్దలు, బంధువులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఆశీర్వదించండి

- వేమూరు అసెంబ్లీ అభ్యర్థి అశోక్‌బాబు సతీమణి లక్ష్మి
- భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లిలో ఎన్నికల ప్రచారం



అద్దేపల్లిలో వృద్ధురాలితో ముచ్చటిస్తున్న అశోక్‌బాబు సతీమణి లక్ష్మి

భట్టిప్రోలు: ప్రజల ముంగిటకే పాలన తీసుకువచ్చి సంక్షేమ పథకాలను పేదలకు చేరువ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలికి వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి లక్ష్మి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి పురవీధులలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ముత్తయిదువులకు బొట్టు పెట్టి ఓట్లను అభ్యర్థించారు. ఇప్పటి వరకు ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అందరితో మమేకమైన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వేమూరు నియోజకవర్గంలో అందరికి అందుబాటులో ఉండే తమ కుటుంబానికి అవకాశం కల్పించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని కోరారు. వేమూరులో తన భర్త అశోక్‌బాబుని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ సభ్యులు కొతరపు పద్మావతి, గద్దె సుశీల, పార్టీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, మండల జేఏసీ కన్వీనర్ గోవర్ధనగిరి చినబుజ్జి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు ఎంఏ రహమాన్, వేల్పూరి బాల సుబ్రహ్మణ్యం, తలకొల యలమంద, పప్పుల చిరంజీవి, పప్పుల విజయరాజు, మద్దుల గిరిధర్, కుందేటి రమేష్, జంపని మునిలక్ష్మి, జాలాది దయమ్మ, దారా చెన్నయ్య, దాసరి గోపాలరావు, దావూరి నాగమల్లేశ్వరరావు, వేల్పూరి సురేష్, పంచాయతీ వార్డు సభ్యులు మల్లేశ్వరి, శేషమ్మ, అబ్దుల్ కరీమ్, మునీర, పెరికల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

పిట్టలవానిపాలెం: రాష్ట్రంలో కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్ సీపీ నాయకుడు, బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్ అన్నారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామ సచివాలయ పరిధిలోని గద్దంవారిపాలెం, కప్పలవారిపాలెం గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి కొనసాగుతుందని అన్నారు.నవరత్నాల పేరుతో రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి పరుగులు తీసిందని గుర్తు చేశారు. బాపట్ల శాసన సభ్యునిగా కోన రఘుపతిని మూడోసారి ఆశీర్వదించాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, వెస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, స్థానిక సర్పంచ్ ఎనికేపల్లి శివకుమారి, ఎంపీటీసీ సభ్యులు గంగయ్య, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కుంతం ప్రసన్నరాజు, అక్కల మురళి, సముద్రాలరెడ్డి, చేబ్రోలు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు సమకూర్చండి



ఆర్డీవో కార్యాలయంలో ఏవో పద్మావతికి వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

రేపల్లె రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలలో దివ్యాంగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఎన్నికల కేంద్రంలో ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని అరుణశ్రీ దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జానం మురళీకృష్ణ కోరారు. పోలింగ్ కేంద్రాలలో దివ్యాంగులకు కల్పించాల్సిన ప్రత్యేక సౌకర్యాలపై ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పోలింగ్ కేంద్రం వద్ద దివ్యాంగులు ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేందుకు వీల్ చైర్స్, ఎస్కార్ట్‌లను ఏర్పాటు చేయటంతో పాటు ర్యాంప్‌లను సైతం ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రానికి రాలేని దివ్యాంగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించాలన్నారు. స్పందించిన ఏవో పద్మావతి మాట్లాడుతూ దివ్యాంగులు ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు, కార్యదర్శి ఆలపాటి మధుసూదనరావు, కోశాధికారి షేక్ ఖాదర్‌వలీ, సభ్యులు శీలం భరత్, డీ.గోపీనాథ్, ఎస్.సాయిబాబు, బి.మోహనరంగారావు తదితరులు పాల్గొన్నారు.

వేమూరులో 25 మంది వలంటీర్లు రాజీనామా



రాజీనామా పత్రాలను ఎంపీడీఓకి అందజేస్తున్న వలంటీర్లు



రాజీనామా పత్రాలు చూపుతున్న కామరాజుగడ్డ నార్త్ గ్రామ వలంటీర్లు

వేమూరు: మండల కేంద్రం వేమూరులో 25 మంది వలంటీర్లు తమ విధులకు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ శేషగిరిరావుకు మంగళవారం అందజేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్న తమపై ఎన్నికల కమిషన్ వేటు వేయడంతో మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

ఆరుగురు వలంటీర్లు రాజీనామా

రేపల్లె రూరల్: చంద్రబాబు అండ్ కో బృందం ఫిర్యాదు మేరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంత కాలం వలంటీర్లు విధులకు దూరంగా ఉండాలంటూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయటంతో మనస్థాపానికి గురైన వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నారు. మంగళవారం రేపల్లె మండలం కామరాజుగడ్డ నార్త్ పంచాయతీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఆరుగురు వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేసి రాజీనామా పత్రాలను సచివాలయంలో అందజేశారు. అవ్వా తాతలకు నిస్వార్థంగా సేవలు చేసే తమపై రాజకీయ రంగు పులమొద్దని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీనామా చేసిన వారిలో రౌతు వెంకట కుటుంబరావు, ఉయ్యూరు శ్రీకాంత్, మోర్ల నాగరాజు, మౌనిక, నాగమల్లేశ్వరరావు, వెంకటాద్రి తదితరులున్నారు.

భట్టిప్రోలులో ముగ్గురు వలంటీర్లు రాజీనామా

భట్టిప్రోలు: భట్టిప్రోలు సచివాలయం–2 పరిధిలో మంగళవారం ముగ్గురు వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో మనస్థాపానికి గురైన వలంటీర్లు కె.దుర్గా మాధవి, పి. క్రాంతి ప్రియ, సీహెచ్ జయరామ్ తేజలు గ్రామ పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావుకు తమ రాజీనామా లేఖలు అందజేశారు. ఈ లేఖలను ఎంపీడీవో జేబీవీ మల్లికార్జునరావుకు పంపనున్నట్లు కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

శాస్త్రీయ దృక్పథమే ప్రగతికి పునాది

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో అడుగులు వేయడం ద్వారా ప్రగతిని సాధించగలరని మానవత రక్త దాతల సంస్థ ఆంధ్రప్రదేశ్ కో-కన్వీనర్ సలీమ్ మాలిక్ పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని టార్గెట్ ఐఐటీ అకాడమీలో మంగళవారం ''రక్తదానంపై అవగాహన- శాస్త్రీయ దృక్పథం'' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. 18 ఏళ్లు నిండి, ఆరోగ్యవంతులుగా ఉన్న వారు ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్ ప్రసంగిస్తూ రెండేళ్లుగా గుంటూరు నగరంలోని అనాథ, వృద్ధాశ్రమాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సలీమ్ మాలిక్ వివిధ రకాల మాయలతో ప్రజలను బురిడీ కొట్టించే విధానాన్ని విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. శిక్షణ సంస్థ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, సామాజికవేత్త కంది పున్నారెడ్డి, మానవత సభ్యులు నవీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.